ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 25.03.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఇంధన సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

2. పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న ఉన్నత లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో తెలిపారు.

3. కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీయాలకు పాల్పడుతోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు.

4. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రానున్న రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

**CM REVIEW ON PETROL, GAS**

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్లు, యూరియా నిల్వలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు సచివాలయంలో ఆయా శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా... ఇంధన సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించారు. పెట్రోల్, గ్యాస్ నిల్వలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కొరత లేకుండా, వినియోగదారులకు సరఫరా

చేయడంలో అవాంతరాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

డెస్క్

**UTTAM KUMAR REDDY**

పెట్రోల్, డీజిల్ లభ్యత విషయంలో ప్రజలు అపోహలను నమ్మొద్దని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వచ్చే మూడు నెలలకు సరిపడా స్టాక్ అందుబాటులో ఉందన్నారు. డిమాండ్ కంటే అధికంగా 17 వేల 898 కిలోలీటర్ల ఇంధనాన్ని సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. కొన్నిచోట్ల ట్యాంకర్లు చేరడం ఆలస్యం కావడం వల్లే 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తున్నాయని, అది కొరత కాదని వివరించారు. హైదరాబాద్‌లోని 596 బంకులు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, ఎల్పీజీ సిలిండర్ల సరఫరాలోనూ ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి భరోసా ఇచ్చారు.

**పిటిసి, హైదరాబాద్**

**స్టీఫెన్ రవీంద్ర**

రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదని, ఇంధన కొరతపై వస్తున్న వదంతులను ప్రజలు ఎవరూ నమ్మవద్దని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర విజ్ఞప్తి చేశారు. వాహనదారులు ఆందోళనతో అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా నిన్న ఒక్కరోజే 1,500 పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లను బంకులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రోజువారీ అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు ఆయిల్ కంపెనీల వద్ద సిద్ధంగా ఉన్నాయని కమిషనర్ వెల్లడించారు.

డెస్క్

**అసెంబ్లీ**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుడుతూ, వైద్య విధాన పరిషత్ పేరును డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ గా మారుస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ మార్పు ద్వారా ద్వితీయ శ్రేణి వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పరిపాలనా సౌలభ్యం, నిధుల వినియోగం, పర్యవేక్షణను మెరుగుపరచడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో ఇకపై జిల్లా ఆసుపత్రులు నేరుగా కొత్త డైరెక్టరేట్ పరిధిలోకి రానున్నాయి.

**HYD –PTC**

**భట్టి విక్రమార్క**

పేదల సంక్షేమం గురించి అసెంబ్లీలో వినడానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులకు మనసు లేదని, అందుకే బడ్జెట్ సమాధానం వినకుండా సభ నుంచి వెళ్లిపోయారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. ఈరోజు అసెంబ్లీలో 'ప్రశ్నోత్తరాల సమయం'లో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఆయన మాట్లాడుతూ... గత పాలకులు మాయమాటలు చెప్పి, ప్రజల్లో భ్రమలు కల్పించి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తామని ఓట్లు వేయించుకున్నారు. కానీ, పదేళ్లలో ఏ ఒక్క పేదవాడికి ఇల్లు కట్టించి ఇవ్వలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న ఉన్నత లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, అదే స్ఫూర్తితో నేడు తమ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని గుర్తు చేశారు.

బైట్ ... విక్రమార్క

జీఎస్

**దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

శాసనసభను ఎలా నడపాలో స్పీకర్ ను ఆదేశించవద్దని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులకు హితవు పలికారు. అధికార పక్షంలో ఉన్నప్పుడు బుల్డోజ్ చేశారని, ఇప్పుడూ అలాగే చేయాలనుకోవడం తగదని అన్నారు. ఈరోజు

శాసనసభలో మంత్రులు బిల్లులు పెట్టే సమయంలో అభ్యంతరాలు వ్యక్తం చేసిన బిఆర్ఎస్ సభ్యుల తీరుపై  మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

జీఎస్

**బండి సంజయ్**

కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీయాలకు పాల్పడుతోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ప్రాంతీయ అసమానతల పేరుతో దేశాన్ని విభజించాలని చూస్తున్నారని అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తే కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రతులను గతంలో చింపివేసిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలతో కాంగ్రెస్ కలిసి పని చేస్తోందని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా మహిళా రిజర్వేషన్లను అమలు చేసి తీరుతామని బండి సంజయ్ స్పష్టం చేశారు.

జీఎస్

**పొంగులేటి**

ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని  వివిధ ప్రాంతాల్లో అసంపూర్తిగా ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తిచేయడమే గాక, ఖాళీగా ఉన్న ఇండ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయిస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

**డెస్క్**

**ఆలిండియా పెన్షనర్స్ ఫెడరేషన్**

కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం తెచ్చిన వ్యాలిడేషన్ ఆక్ట్ కు వ్యతిరేకంగా అన్ని జిల్లాల కలెక్టర్ల కార్యాలయాల ముందు ఆలిండియా పెన్షనర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలంగాణ ప్రభుత్వ దారుల జెఏసి ఛైర్మన్ కె. లక్ష్మయ్య తెలిపారు. జనవరి 2026 ముందు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్ లో పి ఆర్ సి,

డి.ఎ ల పెంపు ఉండదని, దీనివల్ల సీనియర్ పెన్షనర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని ఆయన తెలిపారు.

డెస్క్

**నాకో సురక్షా సంకల్ప్ కార్యశాల:**

రాష్ట్రంలోని 19 జిల్లాలను హెచ్ఐవి, ఎయిడ్స్ విషయంలో అధిక ప్రాధాన్యత జిల్లాలుగా గుర్తించినట్లు నాకో అడిషనల్ సెక్రటరీ, డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాకేశ్ గుప్తా తెలిపారు. హెచ్ఐవి వ్యాప్తి రేటు, అధిక ప్రమాద సమూహాల సంఖ్య, హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తుల నివాసం అనే అంశాల ఆధారంగా ఈ జిల్లాలను గుర్తించామని చెప్పారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈరోజు హైదరాబాద్‌లో సురక్షా సంకల్ప్ కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ గుప్తా మాట్లాడుతూ... ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల మేరకు ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

సౌండ్ బైట్ - డాక్టర్ రాకేష్ గుప్తా, నాకో డైరెక్టర్ జనరల్

ఈ వర్క్ షాప్‌లో తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణతో పాటు 19 ప్రాధాన్యత జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

GS/RNU/HYD

**వాతావరణం**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాగల రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈరోజు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుండి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఆ శాఖ పేర్కొంది. అలాగే, రేపు కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి,

మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

ప్రెస్ నోట్

**గరీమా అగర్వాల్**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అందిస్తున్న 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు.

బైట్ ... గరీమా అగర్వాల్

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**వందేమాతరం**

రేపటి నుండి దేశంలోని అన్ని ఆకాశవాణి కేంద్రాలు ఆరు చరణాల పూర్తి జాతీయ గీతం 'వందేమాతరం'ను ప్రసారం చేయనున్నాయి.

**డెస్క్**